

సాక్షి నల్లగొండ

మంగళవారం : 14 : జనవరి : 2025



రామగిరిలోని రామాలయంలో గోదాదేవి కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణ తంతులో తాళి చూపిస్తున్న అర్చకుడు

న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను కుటుంబ సమేతంగా జరుపుకోవాలని సూచించారు. తెలంగాణలో సంక్షేమం, సుపరిపాలన ప్రగతిపథంలో ముందుకు సాగుతున్న తరుణంలో ప్రజలంతా సంబురంగా సంక్రాంతిని జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఎస్పీ శుభాకాంక్షలు

జిల్లా ప్రజలకు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో అందరూ కలిసి మెలిసి సంతోషంతో పండగ జరుపుకోవాలని కోరారు. దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే వారు జాగ్రత్తగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. సంక్రాంతి ముగ్గులు వేసే సమయంలో మహిళలు, యువతులు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

నకిరేకల్ : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ వేల గొంతుల.. లక్ష డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం (ఎంఇఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవతాప్రసాద్ కోరారు. నకిరేకల్‌లో సోమవారం జరిగిన ఎంఈఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా దోపిడీకి గురవుతున్న మాదగ ఉప కులాలకు న్యాయం చేయాలన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి సైదులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో చింత జాహ్నవిల్సన్, నకిరెకంటి గోపీనాథ్, నగేష్, కొంపెల్లి భిక్షపతి, నర్సయ్య, ఆడెపు జానయ్య, జిల్లా నర్సింహ, రామకృష్ణ, పందు గోపాల్, ఎర్ర వెంకటనారాయణ పాల్గొన్నారు.

గట్టు పైకి వెళ్లిన పార్వతీదేవి



గట్టు పైకి అమ్మవారిని తీసుకెళ్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : భోగి పండుగ సందర్భంగా మండలంలోని చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గట్టు కింద గల పార్వతీదేవి అమ్మవారిని సోమవారం సాయంత్రం గట్టుపైకి తీసుకెళ్లారు. ఏటా వార్షిక బ్రహ్మోత్సవాలకు (భోగి పండుగ రోజు) ముందు అమ్మవారిని గట్టు పైకి తీసుకెళ్లి బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం అమ్మవారిని కిందకు తీసుకురావడం ఆనవాయితి. ఈ సందర్భంగా పార్వతీదేవి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున దేవాలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సురేస్‌శర్మ, సతీష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, నాగయ్యశర్మ అర్చక బృందం ప్రత్యేక పూజలు చేశారు.

మట్టపల్లిలో కల్యాణ మహోత్సవాలు

మఠంపల్లి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం మట్టపల్లి క్షేత్రంలో శ్రీగోదాదేవి రంగనాయకుల స్వామి కల్యాణ మహోత్సవాన్ని శ్రీమాన్ బదరీనారాయణాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, తిరుప్పావై సేవాకాలం, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భోగి పండుగను పురస్కరించుకుని శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. ఆ తర్వాత కల్యాణతంతు పూర్తి చేశారు.

కమనీయం గోదాదేవి కల్యాణం



కల్యాణ మూర్తులను మండపానికి తోడ్కొని వస్తున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని రామగిరి సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం కనుల పండువగా సాగింది. రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సబిత దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అర్చకులు వేదాశీర్వచనం చేసి మంత్రి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, భవేష్‌శర్మ దంపతులు, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పాశం రాంరెడ్డి, ఆలయ ఈఓ జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి దంపతులు

ఊరూరా సంబురం

- మొదటి రోజు అంబరాన్నంటిన భోగి వేడుకలు
- చిన్నారులకు భోగి పళ్లు పోసిన పెద్దలు
- రంగవల్లులతో వీధులన్నీ శోభాయమానం

నేడు మకర సంక్రాంతి

రామగిరి (నల్లగొండ) : సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ మూడు రోజులు జరుపుకునే సంక్రాంతి పండుగ సంబరాలు ఊరూవాడా ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సోమవారం భోగి పండగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. బంధుమిత్రుల రాకతో పట్టణాలతోపాటు గ్రామాల్లోని ప్రతి ఇంటా సందడి నెలకొంది. వేకువ జామునే ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. ఉదయాన్నే మహిళలు రంగవల్లులతో ముంగిళ్లను కళాత్మకంగా తీర్చిదిద్దారు. ముగ్గుల మధ్యలో ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలు, గరక, పిండికూర, నవధాన్యాలు, పూలు, కూరగాయలు పెట్టి సూర్యదేవుడిని పూజించారు. మహిళలు, యువతులు, చిన్నారులు పోటీ పడి ముగ్గులు వేయడంతో వీధులు ఇంద్రధనస్సుల్లా శోభాయమానంగా కనిపించాయి. సాయంత్రం ముత్తైదువులను ఇళ్లకు పిలిచి చిన్నారులకు భోగిపండ్లు పోయించి ఆశీర్వచనాలు అందింపజేశారు.

పతంగుల సందడి

పట్టణంలో ఎటుచూసినా పతంగుల రెపరెపలే కనిపిస్తున్నాయి. పెద్దలు, యువత, చిన్నారులు ఉత్సాహంతో గాలిపటాలను ఎగురవేస్తూ కేరింతలు కొడుతున్నారు. రంగు రంగుల పతంగులను గాల్లోకి ఎగురవేస్తూ పిల్లలు ఆనందపరవశులవుతున్నారు. మంగళ, బుధవారాల్లో కూడా చిన్నారులు గాలిపటాలు ఎగురవేయనున్నారు. ఇదిలా ఉంటే వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీతోపాటు యువతకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు.



నల్లగొండలోని ధాత్రినగర్‌లో భోగి మంటలు వేసిన కాలనీవాసులు



రామగిరిలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న మహిళలు



కులదైవానికి 'భోగి' బోనాలు

మోత్కూరు : మోత్కూరు పట్టణంలో ముదిరాజ్, గౌడ కులస్తులు భోగి పండుగను వినూత్నంగా నిర్వహించారు. భోగి పండుగ రోజు తమ కులదైవాలకు బోనాలు సమర్పించడం ఇక్కడ ఆనవాయితీ. కాగా ముదిరాజ్ కులస్తులు పెద్ద తల్లి ఆలయానికి, గౌడ కులస్తులు కంఠ మహేశ్వర స్వామి ఆలయానికి బోనాలతో ప్రదర్శనగా వెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి దేవతలకు బోనంను నైవేద్యంగా సమర్పించారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల మధ్య బోనాలు వేడుకలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సొసైటీ అధ్యక్షులు మన్నె భీమయ్య, ఉపాధ్యక్షుడు మొలకల రమేష్, కార్యదర్శి కోమటి మత్స్యగిరి, యూత్ విభాగం ప్రతినిధులు కోమటి జనార్దన్, బుంగపట్ల మత్స్యగిరి, బండారు చిరంజీవి, కోమటి అజయ్‌కుమార్, బొల్లేపల్లి వీరేష్, గౌడ సొసైటీ నాయకులు బుర్ర యాదయ్య, బీసు యాదగిరి, కారుపోతుల వెంకన్న, మొరిగాల వెంకన్న, బీసు మధు, గునగంటి శ్రీధర్, బుర్ర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



కాటమయ్య ఆలయానికి బోనాలతో వెళ్తున్న గౌడ కులస్తులు

నేడు సంక్రాంతి

మూడు రోజుల సంక్రాంతి సంబరాల్లో మకర సంక్రాంతి విశేష పర్వదినం. సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే ఈ పుణ్యదినాన సూర్యునికి అర్ఘ్యాలు ఇవ్వడం. పూజలు చేయడం, దానధర్మాలు చేయడం పరిపాటి. మొదటి రోజు భోగి వేడుకలు ముగియగా రెండో రోజు మంగళవారం మకర సంక్రాంతిని ప్రజలు ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. కాల గమనం దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తున్నందున శరీరానికి సమతౌల్యం అవసరం. అందుకని చక్కెర, బెల్లం, నువ్వులతో చేసిన పిండి వంటలు తింటారు. సంక్రాంతిరోజు పొంగలి, పిండి వంటలు వండి పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. ఈ సందర్భంగా గంగిరెద్దుల వాళ్లు ఇళ్ల ముందు డూడూ బసవన్నలు విన్యాసాలు చేస్తూ దీవెనలు అందిస్తారు.



ముగ్గు వేస్తున్న యువతి

నాడు అస్తవ్యస్తం.. నేడు ప్రగతి పథం



- నీలగిరి మున్సిపాలిటీని రికార్డు స్థాయిలో అభివృద్ధి చేశాం
- గత పాలకులది ఆరంభ శూరత్వమే
- మేమొచ్చాక మంత్రి కోమటిరెడ్డి సహకారంతో రూ.వందల కోట్లతో పనులు చేపట్టాం

'సాక్షి' ఇంటర్వ్యూలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

'నీలగిరి మున్సిపాలిటీలో ఏడాది కిందటి వరకు పరిస్థితి అంతా అస్తవ్యస్తం. మేం వచ్చాకే అభివృద్ధికి బాటలు వేశాం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతోనే రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టగలిగాం. కొన్ని పనులు పూర్తి కావస్తుండగా, ఇంకొన్ని కొనసాగుతున్నాయి. నేను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన 11 నెలల కాలంలోనే ఎంతో మార్పు తెచ్చాం.' అని నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీతో ప్రస్తుత పాలకవర్గం గడువు ముగియనున్న నేపథ్యంలో తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను 'సాక్షి' ఇంటర్వ్యూలో వివరించారు.

- సాక్షి ప్రతినిధి, నల్లగొండ

గతంలో పెద్దగా చేసిందేమీ లేదు

బీఆర్‌ఎస్ పాలకవర్గం హయాంలో నల్లగొండ పట్టణంలో పెద్దగా చేసిన అభివృద్ధి ఏమీ లేదు. మెయిన్ రోడ్డు మినహా వారు ఏం చేయలేదు. వార్డుల్లో అభివృద్ధి లేదు. మేం వచ్చాకే అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఉన్న సిబ్బందితోనే ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రూ.వందల కోట్లతో తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, విద్యుత్ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్లు, ఆస్పత్రులను మెరుగు పర్చడం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టాం.

రూ.216 కోట్లతో యూజీడీ నిర్మాణం

అమృత్ 2 కింద రూ.216 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను చేపట్టాం. 180 కిలోమీటర్ల మేర పనులు చేయాల్సి ఉండగా, మా హయాంలో ఇప్పటివరకు 66 కిలోమీటర్లు పూర్తి చేశాం. 14 వార్డుల్లోని 20 ప్రాంతాల్లో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గతంలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీని ఇళ్లకు అనుసంధానం చేశాం.

నిత్యం నీటి సరఫరాకు ట్యాంకులు

పట్టణంలో నిత్యం మంచినీరు సరఫరా చేయాలన్నది మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లక్ష్యం. అందులో భాగంగా రూ.56 కోట్లతో ట్యాంకుల నిర్మాణం చేపట్టాం. 9 వార్డుల్లో 6 లక్షల నుంచి 15 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నాం. 1, 6, 19 వార్డుల్లో వాటర్ ట్యాంకుల పనులు ప్రారంభించబోతున్నాం. ఆ ట్యాంకులకు ఉదయ సముద్రం నుంచి నీటిని సరఫరా చేసేందుకుగాను.. పానగల్ వద్ద 70 ఎంఎల్‌డీ ప్లాంట్ నిర్మాణానికి రూ.96 కోట్లతో డీపీఆర్ రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. ఎండాకాలంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా 6 మోటార్ల కొనుగోలుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎస్‌డీఎఫ్ నిధులు ఇచ్చారు. మున్సిపాలిటీలో 5 ట్రాక్టర్లు, 8 ఆటోలను కొనుగోలు చేసి శానిటేషన్ మెరుగుపర్చాం.

విద్యా, ఉపాధిపై ప్రత్యేక దృష్టి

విద్యా, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టితో పని చేస్తున్నాం. 75 ఏళ్లుగా బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలకు సొంత భవనం లేదు. దానికోసం ప్రకాశంబజార్‌లో రూ.3 కోట్లతో చేపట్టిన భవన నిర్మాణం వేగంగా సాగుతోంది. రామగిరిలోని రామాలయానికి అనుకుని ఉన్న భూమిని మంత్రి రూ.50 లక్షలతో కొనుగోలు చేసి దేవాలయానికి ఇచ్చారు. పట్టణంలోని ఐటీఐలో రూ.20 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ భవనం, మరో రూ.10 కోట్లతో సాంకేతిక అభివృద్ధి భవన నిర్మాణం చేపట్టాం.

రూ.109 కోట్లతో వరద కాల్వలు..

పట్టణంలో రూ.109 కోట్లతో వరద కాల్వల పనులు చేపట్టాం. పట్టణంలో రూ. 54 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టాం. రూ.538 కోట్లతో మంత్రి బైపాస్ రోడ్డును మంజూరు చేయించారు. సెయింట్ ఆల్ఫోన్సెస్ స్కూల్ వద్ద ఎలివేటర్ లిఫ్ట్‌ను పెట్టబోతున్నాం. లతీఫ్‌సాహెబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్టలకు లెఫ్ట్, రైట్‌లో రూ.140 కోట్లు, ఘాట్ రోడ్లను ఏర్పాటు చేయబోతున్నాం. రూ. 96 కోట్లతో నీలగిరి నిలయం భవనం నిర్మాణానికి చర్యలు చేపడతాం.

మెరుగైన వైద్య సేవలు

జైల్‌ఖానా అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో 26 ఏసీలు ఏర్పాటు చేశాం. రూ.60 లక్షలతో చిన్న పిల్లల వార్డులో వెంటిలేటర్లు, ఇంక్యుబేటర్లు సమకూర్చాం. ప్రసవానికి ముందు వచ్చే గర్భిణులు ఉండేందుకు రూ.1.25 కోట్లతో 45 బెడ్ల సామర్థ్యం కలిగిన ప్రీకాస్ట్ భవనం నిర్మిస్తున్నాం. రూ.40 కోట్లతో నర్సింగ్ కాలేజీ భవనాన్ని నిర్మించబోతున్నాం. దంత వైద్య కళాశాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. గత ప్రభుత్వం మెడికల్ కాలేజీ నిర్మాణ బిల్లులు ఇవ్వలేదు. మంత్రి కోమటిరెడ్డి ఆ బిల్లులను ఇప్పించి పూర్తి చేయించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.12 కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మించాం. పాత భవనం కూలగొట్టి కొత్త భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాం.

'భరోసా'కు భూ సర్వే.!

- 16 నుంచి 20 వరకు సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపు
- 140 బృందాలను ఏర్పాటు చేసిన యంత్రాంగం
- గ్రామసభ ఆమోదం అనంతరం ప్రభుత్వానికి జాబితా
- 26 నుంచి రైతు భరోసా జమ చేయనున్న ప్రభుత్వం



నల్లగొండ అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు కోసం కసరత్తు ప్రారంభించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను ఎకరానికి రూ.12 వేల చొప్పున ఇస్తామని.. ఈ నెల 26 నుంచి రైతు ఖాతాల్లో డబ్బులను జమ చేస్తామని చెప్పిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన విధి విధానాలను ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సాగుకు యోగ్యం కాని భూములకు భరోసా ఇవ్వబోమనే స్పష్టం చేసింది. దానికి అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు గాను ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాల వారీగా సర్వే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. సాగు చేయని భూముల జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలని పేర్కొంది. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి ఆమోదం తీసుకోవాలని సూచించింది. అనంతరం ఈ నెల 26 నుంచి రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. సర్వే కోసం జిల్లా వ్యాప్తంగా 140 బృందాలను జిల్లా యంత్రాంగం నియమించింది.

పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగా సర్వే..

తహసీల్దార్లు, వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో భూముల సర్వేను నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బృందంగా ఏర్పడి సర్వే చేస్తారు. ఆయా గ్రామాల్లోని ఆర్‌ఓఆర్ పట్టాదారు పాస్ పుస్తకాల జాబితాను ధరణి పోర్టల్ నుంచి ప్రింట్ తీసుకుని, గ్రామ మ్యాప్, గూగుల్ మ్యాప్‌లతో పోలుస్తూ గ్రామాన్ని సందర్శించి వ్యవసాయ సాగు యోగ్యం కాని భూముల జాబితాను రూపొందిస్తారు. ఆ భూముల జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించి, చదివి వినిపించి చర్చించిన ఆమోదం తీసుకుంటారు. అనంతరం గ్రామాల వారీగా సాగుకు యోగ్యం కాని భూముల పట్టికను పోర్టల్‌లో నమోదు చేసి డిజిటల్ సంతకం చేస్తారు. 25న ఈ జాబితాలను జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు. వాటి ఆధారంగా వ్యవసాయ యోగ్యం కాని భూములను తొలగించి మిగిలిన భూములకు రైతు భరోసా సాయాన్ని 26న ప్రభుత్వం విడుదల చేయనుంది.

సాగుకు యోగ్యం కాని భూములు ఇలా..

ఇళ్ల నిర్మాణం జరిగిన, కాల నీలుగా మారిన, ఇళ్ల స్థలాలు, రాళ్లు రప్పలు, గుట్టలతో నిండిన భూములు, స్థిరాస్తి లేఅవుట్లు, రోడ్లుగా మారినవి, పరిశ్రమలు నిర్మించినవి, గోదాములు, గనులకు వినియోగిస్తున్న భూములు, ప్రభుత్వం వివిధ పథకాలకు సేకరించిన అన్ని రకాల భూములు సాగుకు యోగ్యం కాని వాటిగా గుర్తిస్తారు.

సాగు చేసే భూములకే భరోసా వస్తుంది



రైతు భరోసా పథకాన్ని ఈ నెల 26 నుంచి ప్రభుత్వం అమలు చేయనుంది. సాగుకు యోగ్యం కాని భూములను రైతు భరోసా పథకం నుంచి తొలగించనుంది. సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల వారీగా సర్వే నిర్వహించనున్నాం. సర్వేలో సాగుకు యోగ్యం కాని భూములను గుర్తిస్తాం. ప్రభుత్వం సాగు చేసే భూములకే రైతు భరోసా జమ చేయనుంది.

- శ్రవణ్‌కుమార్, డీపీఓ, నల్లగొండ

పెద్దగట్టు ఆలయ కమిటీ సభ్యుల నియామకం

చివ్వెంల: రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన దురాజ్‌పల్లి శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఆలయ నూతన కమిటీ సభ్యులను నియమించినట్టు దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులుగా సూర్యాపేటకు చెందిన సీనియర్ న్యాయవాది పోలెబోయిన నర్సయ్య యాదవ్, పోలెబోయిన నరేష్ పిళ్లే, వట్టి ఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన వీరబోయిన సైదులు యాదవ్, సూర్యాపేట మండలం కేసారానికి చెందిన మెంతబోయిన లింగస్వామి, మెంతబోయిన చిన్న మల్లయ్య, ఖాసీంపేటకు చెందిన సిరపంగి సైదమ్మ నియమితులయ్యారని పేర్కొన్నారు. త్వరలోనే ఆలయ వద్ద సమావేశం నిర్వహించి చైర్మన్ ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

టాటా ఏస్ బోల్తా.. 15 మందికి గాయాలు


క్షతగాత్రులను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చిన 108 సిబ్బంది

భువనగిరిటౌన్: టాటా ఏస్ వాహనం బోల్తా పడి 15 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణ శివారులోని బైపాస్ రోడ్డుపై సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ మండలం ఎదులాబాద్‌కు చెందిన 15 మంది కుటుంబ సభ్యులు హన్మకొండ జిల్లాలోని ఐనవోలు జాతరకు టాటా ఏస్ వాహనంలో బయల్దేరారు. మార్గమధ్యలో భువనగిరి పట్టణ శివారులోని బైపాస్ రోడ్డుపై టాటా ఏస్ వాహనం ముందు టైరు పేలడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మల్లేష్, లక్ష్మి, బాలమ్మ, శ్రీను, రాజు, సంతోష్‌కు తీవ్ర గాయాలు కాగా.. మరో తొమ్మిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. క్షతగాత్రులను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను వారి బంధువులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

బైక్‌లు చోరీ చేస్తున్న దొంగ అరెస్ట్

- రెండు బైక్‌లు స్వాధీనం

గరిడేపల్లి: బైక్‌లు చోరీ చేస్తున్న దొంగను సోమవారం అరెస్ట్ చేసినట్లు గరిడేపల్లి ఎస్ఐ నరేష్ తెలిపారు. గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన దండుగుల జాన్ బైక్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా జనవరి 7న కీతవారిగూడెంలోని మీసేవా వద్ద ఒక బైక్, అదేరోజు కోదాడ పట్టణంలో మరో బైక్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వలిగొండ: కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన వలిగొండ మండలం ఆరూర్‌లో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరూర్ గ్రామానికి చెందిన మద్రి అంజయ్య వ్యవసాయంతో పాటు గొర్రెల కాపరిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా సోమవారం రాత్రి అంజయ్య పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చిలుకూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చిలుకూరు మండలం ముక్యాల కాలువ వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని మాధవరేణిగూడెం గ్రామానికి చెందిన ఆకుల లింగయ్య(55) గ్రామ సమీపంలో గల వెంకటేశ్వర ఇంజనీరింగ్ వర్క్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకొని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా కోదాడ నుంచి హుజూర్‌నగర్ వస్తున్న బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అల్లుడు కారింగిల జానకిరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వెన్నముద్ద చేతబట్టి..
కాళీయమర్ధనుడిగా ఊరేగి


వెన్నముద్ద కృష్ణుడి అలంకార సేవను ఊరేగిస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు


కాళీయమర్ధనుడిగా నృసింహుడు

- యాదగిరిగుట్టలో వైభవంగా కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయంలో నిత్యారాధనలు జరిపించారు. అనంతరం దివ్య ప్రబంధ పారాయణములు పారాయణీకులచే నిర్వహించారు. స్వామివారిని వెన్నముద్ద కృష్ణుడిగా అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. సేవోత్సవం తరువాత ఆలయ అద్దాల మండపంలో స్వామిని, ఆళ్వారులను, అమ్మవారిని అధిష్ఠించి ప్రత్యేక పూజలు, పారాయణాలు పఠించారు. సాయంత్రం నిత్యారాధనలు ఆగమశాస్త్ర ప్రకారం జరిపించారు. అనంతరం ద్రవిడ ప్రబంధ సేవా కాలము నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారిని కాళీయమర్ధనుడిగా అలంకరించి ఊరేగించారు. సేవోత్సవం అనంతరం ఆలయ అద్దాల మండపంలో అధిష్ఠించి, అలంకార విశిష్టతను ఆచార్యులు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు, పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


శోభ (ఫైల్)

గరిడేపల్లి: మండల పరిధిలోని ఎల్బీనగర్ గ్రామంలో ఆదివారం రాత్రి ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన నందిపాటి శోభ (32)కు 2011లో సూర్యాపేటకు చెందిన రాజు అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. కొంతకాలంగా భర్తకు దూరంగా గరిడేపల్లి మండలం ఎల్బీనగర్‌లో అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్న శోభ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆదివారం రాత్రి శోభ తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని సోమవారం శోభ తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్.. యువకుడు దుర్మరణం


ప్రవీణ్ (ఫైల్)

నల్లగొండ: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో సోమవారం జరిగింది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని బీటీఎస్ ప్రాంతానికి చెందిన గంటి ప్రవీణ్(23) రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై వీటీ కాలనీలో ఉంటున్న తన మేనమామ ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో న్యూ వీటీ కాలనీ వద్ద బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రదీప్ బైక్ పైనుంచి ఎగిరి రోడ్డుపై పడిపోవడంతో అతడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు.

అదుపుతప్పి కారు బోల్తా


బోల్తాపడిన కారు

మిర్యాలగూడ అర్బన్: వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై మిర్యాలగూడ పట్టణంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి గుంటూరుకు ఇద్దరు వ్యక్తులు కారులో వెళ్తుండగా.. మార్గమధ్యలో మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లైఓవర్ సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న దిమ్మెలను ఢీకొని బోల్తాపడింది. స్థానికులు గమనించి కారులోని ఇద్దరు వ్యక్తులను అతికష్టం మీద బయటకు తీశారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


విజయ్

వేములపల్లి: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణం శాంతినగర్‌కు చెందిన కూరెళ్లి విజయ్ రైస్ మిల్లులో గుమాస్తాగా పనిచేసేవాడు. కొద్దిరోజుల క్రితం విజయ్ ఉద్యోగం పోవడంతో మనస్తాపానికి గురైన అతడు 10వ తేదీ ఉదయం నీళ్లు తీసుకొస్తానని స్కూటీపై ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. విజయ్ భార్య, బంధువులు అతడి కోసం వెతుకుతున్న క్రమంలో వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమ కాల్వ బ్రిడ్జి వద్ద అతడి స్కూటీ కనిపించింది. నాలుగు రోజులుగా కాల్వ వెంట గాలిస్తున్నప్పటికీ విజయ్ ఆచూకీ లభించలేదు. విజయ్ భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

వేములపల్లి: పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడిచేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం రావులపెంట గ్రామ శివారులోని పశువైద్యశాల వద్ద ఐదుగురు ట్రాక్టర్ డ్రైవర్లు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.1500 నగదు, 5 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

డిండి: మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో చెక్‌డ్యాం వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెక్‌డ్యాం నీటిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెక్‌డ్యాం నీటిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

మోదుబావిగూడెం వాసికి నేషనల్ ప్రీమియం అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రశాంత్ చంద్రగిరి

ఆత్మకూరు(ఎం): మండలంలోని మోదుబావిగూడేనికి చెందిన ప్రశాంత్ చంద్రగిరి నేషనల్ ప్రీమియం– 2025 బెస్ట్ సాంగ్ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సరస్వత పరిషత్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో హైకోర్టు జడ్జి చంద్రకుమార్, జబర్దస్త్ కమెడియన్ షేకింగ్ శేషు, నేషనల్ ప్రీమియం అవార్డు ఫౌండర్ పరిపెల్లి రవీశ్రీగౌరిశ్రీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, సమాజానికి ఉపయోగపడే మరిన్ని గీతాలు రాసి పాడుతానని ప్రశాంత్ చంద్రగిరి తెలిపారు. చంద్రగిరిని పలువురు అభినందించారు.

వరిలో కలుపు నివారణ చర్యలు

పాడిపంట


చాకిరాల వద్ద కలుపు మందు పిచికారీ చేస్తున్న రైతు

నడిగూడెం: ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి నాట్లు పూర్తయ్యాయి. ఇప్పటి నుంచి వరిలో కలుపు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక పంట దిగుబడి సాధించవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ చెబుతున్నారు. వరిలో కలుపు నివారణకు ఆయన సలహాలు, సూచనలు..

- నాటిన 3 నుంచి 5 రోజుల లోపు ఎకరానికి బ్యూటాక్లోర్ 1–1.5 లీటర్లు లేదా ప్రెటిలాక్లోర్ 500–600 మి.లీ. లేదా ఆక్సాడయార్జిల్ 35–40 గ్రాములు లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ (0.6 శాతం)+ప్రెటిలాక్లోర్ (6.0శాతం) 4 కిలోల గుళికలు, పైరజోసల్ఫ్యూరాన్ ఈథైల్+ప్రెటిలాక్లోర్ 6.15 గుళికలు 4 కిలోలు లేదా నాటిన 8–10 రోజుల లోపు పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80–100 గ్రాములు 20 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.
- నాటిన 15–20 రోజులకు ఎకరానికి సైహలోఫాస్ పిబ్యూటైల్ 250–300 మి.లీ. లేదా ఫినాక్సిపాప్ పి ఈథైల్ 250–300 మి.లీ. లేదా మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్+క్లోరిమ్యురాన్ ఇథైల్ అనే మందును 8 గ్రాములు లేదా పెనాక్సులామ్+సైహలోఫాప్ బ్యుటైల్ 1.6 – 1.8 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వెడల్పాకు కలుపు నివారణకు నాటిన 25–30 రోజులకు 2,4–డి సోడియం సాల్ట్ అనే మందు ఎకరానికి 500–600 గ్రాములు లేదా 2,4డి 1.25–1.50 లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- గడ్డిజాతి మరియు వెడల్పాకు కలుపు నివారణకు బిస్‌పైరిబాక్ సోడియంను ఎకరానికి 100 మి.లీ. (అనగా లీటరు నీటికి 0.5 మి.లీ. మందును) 200 లీటర్ల నీటికి కలిపి 15 నుండి 20 రోజుల మధ్య పిచికారీ చేయాలి.

- కోనో వీడర్, పవర్ వీడర్‌తో అదనపు దిగుబడి

శ్రీ పద్ధతిలో, డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగుచేసిన వరి పొలాల్లో అయితే పవర్ వీడర్ లేదా కోనో వీడర్ పరికరాల ద్వారా కలుపు తీస్తే పంట దిగుబడి అదనంగా వస్తుంది. నాటు పెట్టిన 10 రోజుల తర్వాత నుంచి వారం, పది రోజుల వ్యవధిలో నాలుగైదు సార్లు కలుపు తీయాలి. ఇలా చేయడం వలన పొలంలో పెరిగిన కలుపు పంటకు పచ్చి రొట్ట ఎరువుగా ఉపయోగపడుతుంది. దీంతో పొలంలో పిలకలు, దుబ్బులు బాగా వస్తాయి. గాలి, వెలుతురు బాగా సోకడం వలన చీడపీడల సమస్య తగ్గుతుంది.

నల్లగొండ వాసులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న బాల్సన్ నాయక్, పల్లె కిషోర్‌కుమార్

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త బాల్సన్‌నాయక్, తబలా కళాకారుడు, రిజర్వ్‌డ్ ఆర్మ్‌డ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ పల్లె కిషోర్‌కుమార్‌కు పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ వారు మంగళవారం కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌స్పైర్ రాయల్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ పురస్కారాలను అమెరికన్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ మధుకిక్రిషన్ చేతులమీదుగా వారు అందుకున్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొతిమా, సౌత్ ఇండియన్ అంబాసిడర్ డాక్టర్ అద్దంకి రాజాయోనా, కన్నడ సాహితీవేత్తలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- పరారీలో మరో వ్యక్తి


వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ రూరల్ పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: సెల్‌టవర్ల నుంచి రేడియో రిమోట్ యూనిట్ల(ఆర్‌ఆర్‌యు)ను దొంగలించి సొమ్ము చేసుకుంటున్న నిందుతుడిని మిర్యాలగూడ రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐలు పి. లోకేష్, సీహెచ్. వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామ శివారులో ఎయిర్‌టెల్ సెల్ టవర్ నుంచి రెండు రేడియో రిమోట్ యూనిట్లు చోరీకి గురైనట్లు టవర్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం వెంకటాద్రిపాలెం రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా.. బైక్‌పై వెళ్తున్న ధీరావత్‌తండాకు చెందిన ధీరావత్ నవీన్ పోలీసులను చూసి పారిపోతుండగా అతడిని వెంబడించి పట్టుకుని విచారించగా.. గత ఏడాది డిసెంబర్‌లో శ్రీనివాసనగర్ గ్రామంలోని ఎయిర్‌టెల్ టవర్ నుంచి బ్యాటరీ, జూలైలో నందిపాడు శివారులోని ఎయిర్‌టెల్ టవర్ నుంచి ఆర్‌ఆర్‌యులను దొంగిలించి హైదరాబాద్‌లో విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. అంతేకాకుండా పెన్‌పహాడ్ మండలం ధర్మాపురంతండాకు చెందిన లకావతు వెంకన్నతో కలిసి ఐలాపురంలోని సెల్ టవర్‌లో రెండు ఆర్‌ఆర్‌యులను దొంగలించి శ్రీనివాసనగర్‌లో గల గుట్ట వద్ద చెట్ల పొదల్లో దాచిపెట్టారు. సోమవారం వాటిని తీసుకుని ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌లో విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి రూ.2.50 లక్షల విలువైన ఆర్‌ఆర్‌యులతో పాటు ద్విచక్ర వాహనం, కటింగ్ ప్లేయర్‌ను స్వాధీనం చేసుకుని మాండ్‌కు తరలించినట్లు ఎస్ఐలు తెలిపారు. నవీన్‌పై మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో 5 కేసులు, కొండమల్లేపల్లి, చింతపల్లి, తిరుమలగిరి(సాగర్), నిడమనూరు, నేరెడుగొమ్ము, మాడుగులపల్లి, దేవరకొండ, వేముపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో మరో 11 చోరీ కేసులు నమోదైనట్లు గుర్తించామన్నారు. నవీన్‌కు సహకరించిన లకావత్ వెంకన్న పరారీలో ఉన్నాడని.. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఏఎస్ఐ రాములు, కానిస్టేబుళ్లు సైదానాయక్, శంకర్, నాగరాజు, హోంగార్డు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

స్కాన్ చేద్దాం.. మార్కులు వేద్దాం!

ఠాణాలకు వచ్చే పౌరులనుంచి ప్రజాభిప్రాయ సేకరణ

- అందుబాటులోకి క్యూఆర్ కోడ్
- స్కాన్ చేసి అభిప్రాయం చెప్పేందుకు వెసులుబాటు
- సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకునేందుకు దోహదం
- అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు
- ఫీడ్‌బ్యాక్ ఆధారంగాస్టేషన్లకు ర్యాంకులు



భువనగిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్

భువనగిరిటౌన్ : స్టేషన్లకు వచ్చే పౌరులతో పోలీసుల వ్యవహార శైలి, వారు అందించే సేవలు ఎలా ఉంటున్నాయి.. తెలుసుకునేందుకు ఉన్నత స్థాయి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం పోలీసు శాఖ తీసుకువచ్చిన క్యూ ఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ విధానాన్ని జిల్లాలోని అన్ని స్టేషన్లలో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. పోలీస్‌స్టేషనల్‌లో ఎదురైన అనుభవాలను పౌరులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు.

ప్రయోజనాలు

క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు తెలియజేసిన అభిప్రాయాల ఆధారంగా పోలీస్ స్టేషన్లకు ర్యాంకులు కేటాయిస్తారని సమాచారం. ప్రజా పర్యవేక్షణ అధికమైతే.. పోలీసుల పనితీరు మెరుగుపడుతుందని అంచనా వేస్తున్నారు. అంకితభావంతో పనిచేసిన సిబ్బందికి గుర్తింపు లభిస్తుందని, గాడి తప్పిన స్టేషన్లను చక్కదిద్దడానికి దోహదపడుతుందని పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

క్యూఆర్ కోడ్ ఎలా స్కాన్ చేయాలి

ప్రస్తుతానికి పోలీసు స్టేషన్లలోనే క్యూఆర్ కోడ్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ప్రస్తుతానికి పోలీసు స్టేషన్లలో మాత్రమే అందుబాటులో ఉంచనున్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఎస్ఐ, ఏఎస్ఐ, రిసెప్షన్ గదులు, స్టేషన్ల ఆవరణలో స్టిక్కర్లను అతికించనున్నారు. జిల్లాలోని చాలా పోలీసు స్టేషన్లలో ఇప్పటికే క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు ఏర్పాటు చేశారు.

ప్రజలు ఏమంటున్నారంటే!

ఇదిలా ఉండగా పోలీసుల సేవలు, వారి పనితీరుపై తెలుసుకునేందుకు కేవలం పోలీసు స్టేషన్లలోనే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలు, జనరద్దీ ప్రాంతాల్లోనూ క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు ఏర్పాటు చేస్తే బాగుటుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఈ విధంగా అయితే ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని తెలియజేసే అవకాశం ఉంటుందని, తద్వారా పోలీస్ శాఖ లక్ష్యం నేరవేరుతుందని పలువురు అంటున్నారు. స్టేషన్లలోనే క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం వల్ల పోలీసులకు బయపడి ఎవరు కూడా తమ అభిప్రాయాన్ని తెలియజేయకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాన చౌరస్తాలు, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, టోల్‌గేట్లు, హోటళ్లలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఈ అంశాలపై ఫీడ్‌బ్యాక్

- బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత కేసు ఎలా నమోదు చేశారు. ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేశారా లేదా?
- ఎఫ్ఐఆర్ చేశారా, లేదా?
- పోలీసులు మాట్లాడిన తీరు ఎలా ఉంది?
- ట్రాఫిక్ చలాన్ల గురించి, పాస్‌పోర్టు ధ్రువీకరణ ఏ స్థితిలో ఉంది?
- ఇతర సేవలు గురించి ఏమైనా చెప్పాలి అనుకుంటున్నారా?

పై అంశాలపై క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేసే వెసులుబాటును పోలీసు శాఖ కల్పించింది.

జవాబుదారీతనం పెరుగుతుంది

యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌కు పది రోజుల క్రితమే స్టిక్కర్లు వచ్చాయి.పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారికి అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశాం. ఫిర్యాదుదారులు, స్టేషన్ వచ్చిన వారు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలు తెలియజేస్తారు. ఫీడ్‌బ్యాక్ సమాచారం నేరుగా సీపీ కార్యాలయానికి వెళ్తుంది. దీని ఆధారంగా సేవలు మెరుగుపర్చడం, ఫిర్యాదుదారుడికి అందుబాటులోకి రావడం జరుగుతుంది. సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుంది.

– రమేష్, యాదగిరిగుట్ట పట్టణ సీఐ

పాత పథకాలనే కొత్తవిగా వక్రీకరించారు

- తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్

మోత్కూరు : గత ప్రభుత్వం ప్రవేశపెట్టి పథకాల్లో కోత విధించి, వక్రీకరించి కొత్త పథకాలుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ పేర్కొనానరు. సోమవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. త్రిఫ్ట్ పథకం ఆరు దశాబ్దాల నుంచి ఉందని, అప్పట్లో కార్మికుడు ఆరు పైసలు తన ఖాతాలో జమ చేసేవాడని, కాల గమనంలో పథకం రూపాంతరం చెందిందన్నారు. గతంలో 36 నెలలు ఉన్న చేనేతకు చేయూత పొదుపు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలుగా నిలిపివేసి, ప్రస్తుతం 26 నెలలకు కుదించిందన్నారు. ఇప్పుడు పథకం కొత్తగా ప్రవేశపెట్టినట్లు ప్రకటించడం చేనేత కార్మికులను మోసం చేయడమేనన్నారు. నేతన్న బీమా పథకాన్ని పేరు మార్చి నేతన్న భద్రతగా మళ్లీ ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నూలు, నగదు బదిలీ పథకాన్ని నిలిపివేసిందని ఆరోపించారు. సంవత్సరానికి రూ.24 వేలు వచ్చే పథకాన్ని రూ.18వేలకు తగ్గించి చేనేత కార్మికుల పొట్టగొట్టిందని ఆవేదన వ్యక్తం చేశాడు. చేనేత అభయహస్తం పథకం గతంలో ఉన్నదేనన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు సంవత్సరానికి రెండు చీరల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న కలెక్టరేట్‌ల ఎదుట, ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో నేతన్న గర్జనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి కొత్త పథకాల పేరిట ప్రకటనలు చేశారని పేర్కొన్నారు.